క్లుప్తంగా

గిరిజన సమస్యలపై పోరాటం స్ఫూర్తిదాయకం



వెంకటేశ్వర్లు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చప్పిడి వెంగళరావు తదితరులు

ఒంగోలు: గిరిజన సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన వెంకటేశ్వర్లు స్ఫూర్తి దాయకులని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు పేర్కొన్నారు. స్థానిక 16వ డివిజన్ కార్పొరేటర్ శ్రీరామ నాగ భూషణం తండ్రి వెంకటేశ్వర్లు సంస్మరణ సందర్భంగా స్థానిక శ్రీనివాసకాలనీలోని కార్పొరేటర్ ఇంటి వద్ద జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వెంకటేశ్వర్లు లేని లోటు గిరిజనలకు తీరని లోటన్నారు. వీరి ఆశయాలతో యువత ముందుకు సాగాలని కోరారు. గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు, గిరిజన ఉద్యోగ సంఘాల నాయకులు ప్రభాకరరావు, దళిత సంఘాల నాయకులు సుబ్బారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళికి సహకరించాలి



ఉప్పుగుండూరులో మాట్లాడుతున్న సీఐ అజయ్ కుమార్, ఎస్సై బ్రహ్మనాయుడు

నాగులుప్పలపాడు: ప్రస్తుతం సాధారణ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల నియమావళికి ప్రజలంతా సహకరించాలని ఒంగోలు రూరల్ సీఐ అజయ్ కుమార్ అన్నారు. ఎలక్షన్ కోడ్‌కు సంబంధించి ప్రజలకు అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం ఉప్పుగుండూరులో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అజయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ప్రకారం మైకులతో ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించాలన్న తప్పకుండా ఎలక్షన్ కమిషన్ అనుమతులు తీసుకోవాలని అలాగే నగదు తరలింపులో రూ. 50 వేలకు మించి తీసుకెళ్తే తప్పకుండా ఆ నగదుకు సరైన బిల్లులు సూచించేలా ప్రజలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఎస్సై బ్రహ్మనాయుడు ఉన్నారు.

ముడిరాయి లారీ స్వాధీనం

బల్లికురవ: పర్మిట్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న ముడిరాయి లారీని మైన్స్ విజిలెన్స్ ఏడీ వీరేష్ గురువారం అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఈర్లకొండ నుంచి పర్మిట్ లేకుండా సక్రమంగా మార్టూరు వైపు వెళ్తుండగా అదుపులోకి తీసుకుని స్థానికులు పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పర్మిట్ లేకుండా గ్రానైట్ మీటరు ముడి రాళ్లు స్లాబులు తరలించటం చట్టరీత్యా నేరమన్నారు. ఎంతటి వారిపైనైనా పెనాల్టీతోపాటు లారీని సీజ్ చేస్తామని ఏడీ హెచ్చరించారు.

ఓట్ల తొలగింపు అర్జీదారులపై చర్యలు తీసుకోవాలి

బల్లికురవ: పథకం ప్రకారం గ్రామాల్లో లేరని ఓట్లు తొలగించాలని ఆన్‌లైన్‌లో అందజేసిన అర్జీదారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఏఈఆర్వో, తహసీల్దార్ యం సుభద్ర గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని వల్లాపల్లి, పెద అంబడిపూడి, చినంబడిపూడి, వమవరం తదితర పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో ఫారం-7 తొలగింపులకు 279 అర్జీలు అందజేశారన్నారు. ఈఅర్జీలపై ఇటీవల టీమ్ ఆధ్వర్యంలో గ్రామాల వారీగా విచారణ చేపట్టారన్నారు. తొలగింపులకు సంబంధించి వచ్చిన అర్జీదారులంతా గ్రామాల్లోనే నివాసం ఉంటున్నారన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తొలగింపులకు సంబంధించి అర్జీలు అందజేసిన వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్సై పీ. నాగశివారెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ వివరించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

సంతమాగులూరు (అద్దంకి రూరల్): బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సంతమాగులూరు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కైపు మహేష్‌రెడ్డి అన్నారు. గురువారం సంతమాగులూరు లోని పార్టీ కార్యాలయంలో సజ్జాపురం గ్రామ ఎస్సీ కాలనీ వాసులు, గ్రామ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగనన్న అందజేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి వివరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఉత్సవమూర్తుల విగ్రహాల ఊరేగింపు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో నేటి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రతిష్ట సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఉత్సవమూర్తుల విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. స్థానిక బొడ్డు రాయి సెంటర్లో శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రతిష్ట సందర్భంగా మూలవిరాట్టులను ఊరేగింపు నిర్వహించారు. భక్తులు నేడు హాజరై జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

అందరి సంతోషమే వైఎస్సార్ సీపీ లక్ష్యం

● ఇంటింటి ప్రచారంలో బాలినేని శ్రీకావ్య



క్లాపేటలో స్థానికులతో మాట్లాడుతున్న బాలినేని శ్రీకావ్య

ఒంగోలు: సంతోషం ఏ ఒక్కరికో సొంతం కాకూడదని, ప్రతి ఇంట్లో ఉండాలనేదే వైఎస్సార్ సీపీ లక్ష్యం అని బాలినేని ప్రణీత్‌రెడ్డి సతీమణి శ్రీకావ్య పేర్కొన్నారు. గురువారం రాత్రి స్థానిక 11వ డివిజన్‌లోని క్లాపేటలో ఎష్కోలు ప్రార్థనా మందిరం లైను నుంచి ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ నగరంలో జరిగిన అభివృద్ధిని గమనించాలన్నారు. గతంలో ఎక్కడ చూసినా మురుగునీరు నడి రోడ్లమీద ఉండేదని, కానీ నేడు రోడ్లన్నీ సుందరంగా మారడంతోపాటు కాలువలు కూడా పెద్ద ఎత్తున నిర్మాణం చేయడం ద్వారా సమస్య తగ్గిందంటూ పలువురు స్థానికులు శ్రీకావ్య దృష్టికి తీసుకువచ్చారు. సంక్షేమ పథకాలు పేదల ఇళ్లల్లో కాంతులు నింపుతున్నాయని, కానీ కొంతమంది కుబేరులకు మాత్రం కడుపుమంటగా ఉందని, 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం అని వ్యాఖ్యానించారు. వలంటీర్లను రద్దుచేయాలని కొంతమంది మీటింగ్ పెట్టి మరీ మాట్లాడడం విడ్డూరంగా ఉందని, గతంలో మాదిరిగా పెన్షన్ కోసం తాము పడిగాపులు పడినట్లే.. ఆ రిటైరైన ఉద్యోగులు కూడా ఆన్‌లైన్‌లో కాకుండా పెన్షన్ తీసుకోవడానికి సిద్ధంగా ఉంటారా అని ప్రశ్నించారు. శ్రీకావ్య వెంట 11వ డివిజన్ కార్పొరేటర్ గంగవరపు ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు జాన్ ఇసాక్(నాని), ఉపాధ్యక్షుడు కావూరి కిరీటి, క్లాపేట క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రంజిత్, నగరపాలక సంస్థ కోఆప్షన్ మెంబర్ శ్యాంసాగర్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు చింతగుంట్ల సువర్ణ, రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డి అరుణ, జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర, సోషల్ మీడియా కన్వీనర్ రాజిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పోకల అనూరాధ, కార్పొరేటర్లు తాడి కృష్ణలత, వైఎస్సార్ సీపీ నాయకులు నజీర్, నాగూర్, రావులపల్లి ధనలక్ష్మి యాదవ్, గంధం సామేలు, తోటపల్లి సోమశేఖర్, సింగరాజు యశ్వంత్ పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేసే పార్టీల వైపే కృష్ణ మాదిగ



పెద్దిపోగు కోటేశ్వరరావు

ఒంగోలు: మాదిగలను మోసం చేసే పార్టీలకు కొమ్ము కాయడమే మంద కృష్ణ మాదిగ నైజం అని ఏపీ కార్మిక సంక్షేమ బోర్డు సభ్యులు, మాదిగ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పెద్దిపోగు కోటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉద్యమం నడపడమే మంద కృష్ణ మాదిగ అజెండా అన్నారు. కురుక్షేత్రం సభ పెట్టినప్పుడు ఎంతో మంది మాదిగ యువకులపై చంద్రబాబు కేసులు పెడితే నేడు ఆయనకు మద్దతు పలకడం సరికాదన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామన్న బీజేపీ రెండు పర్యాయాలు అధికారం పూర్తి చేస్తున్నా ఇంకా బీజేపీతో లాలూచీపడడం జాతిని అవమానించడమే అన్నారు. చంద్రబాబు హయాంలో డప్పు కళాకారులు, చర్మకారులకు 23 వేల మందికి మాత్రమే పెన్షన్లు ఇస్తే నేడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అదనంగా 1.10 లక్షల మందికి పెన్షన్లు నెలనెలా రూ. 3వేలు అందుతున్నాయన్నారు. కేవలం మందా కృష్ణ మాదిగ ఆయన మనుగడ కాపాడుకునేందుకు చంద్రబాబుకు మద్దతు పలుకుతున్నారని, కానీ ఆయన మాట విని మోసపోయేందుకు ఎవరు సిద్ధంగా లేరన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో మరలా వైఎస్ జగన్ మోహన్ రెడ్డే సీఎం అని స్పష్టం చేశారు.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం



కొత్తపట్నంలో సిమెంట్ రోడ్డు వేస్తున్న దృశ్యం

కొత్తపట్నం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రోడ్డు విస్తర్ణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ నిధులతో రూ.2.75 కోట్లతో మంజూరైన రోడ్డు పనులు చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్ నుంచి కె.పల్లెపాలెం బీచ్ వరకు డబుల్ రోడ్డు మంజూరైంది. ఇప్పటికే కె.పల్లెపాలెం బీచ్ రోడ్డు పూర్తి అయింది. కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో సిమెంట్ రోడ్డు ఒక వైపు ప్రారంభించారు. రెండు వైపులా సిమెంట్ రోడ్డు వేసి మధ్యలో డివైడర్ వేయటానికి స్థలం వదిలి పెట్టి రోడ్డు వేస్తున్నారు. రెండు వైపులా విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్‌ను లైన్లు లాగుతున్నారు. రోడ్డు మధ్యలో నాలుగు అడుగుల డివైడర్, రెవెన్యూ ప్లాంటేషన్, రౌండ్ సర్కిల్ నిర్మాణం రెండు రోజుల్లో ప్రారంభిస్తారు. వీటి కోసం కోసం మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఒడా నిధులు రూ.47 లక్షల మంజూరు చేయించారు. నెల రోజుల్లో అన్ని పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

కవిత్వం సమాజానికి దిక్సూచి కావాలి



కవులు, రచయితులను సన్మానిస్తున్న కళా మిత్రమండలి సభ్యులు

ఒంగోలు మెట్రో: స్థానిక మల్లయ్య లింగం భవనంలో గురువారం సాయంత్రం కళామిత్ర మండలి జాతీయ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు మాట్లాడుతూ కవికి వర్తమానాన్నే కాకుండా గతాన్ని కూడా దర్శించే నేర్పు ఉండాలన్నారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు, భాషా విభూషణ డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ కవి సమాజానికి దిక్సూచి లాంటి వాడని, కవియైన వాడికి దర్శనం, ప్రకటనం, సృజనాత్మక శక్తితో పాటు ఆలోచన, విశ్వాసం ఉండాలని, భావోద్రేకమే కవిత్వానికి ప్రాణమని పేర్కొన్నారు. ప్రముఖ సాహితీవేత్త, సంగీత విద్వాంసులు, కళారత్న డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, ప్రసంగిస్తూ మనిషిని చైతన్యపరచి ముందుకు నడిపించేదే కవిత్వం లక్షణంగా ఉంటుందని ఉద్ఘాటించారు. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ కవిత్వం గురించి వివరిస్తూ ఆలోచనాత్మకంగా బహిర్గతం చేసే విధంగా ఉండాలని తెలియజేశారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న సంస్థ కార్యదర్శి సింహాద్రి జ్యోతిర్మయి, కుర్రా ప్రసాద్ బాబు, మిడసల మల్లిఖార్జున రావు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావులు ప్రసంగించారు. అనంతరం జరిగిన సభలో ప్రముఖ భావకవి కోరిశపాటి బాలకృష్ణారెడ్డి, విశ్రాంతన్యాయమూర్తి, డాక్టర్ డి.ధాత్రి కుమారి, తెలుగు భాషా పరిశోధకురాలును కళామిత్ర ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులంతా తమ కవితా గానంతో చక్కగా అలరించారు. కార్యక్రమాన్ని యు.వి.రత్నం, డాక్టర్ మున్నంగి రాజకుమారి, ఓరుగంటి ప్రసాద్, పి.వి.సురేష్, యువ కవయిత్రి బీరం అరుణ తదితరులు పర్యవేక్షించారు. కవిసమ్మేళనంలో కనమాల రాఘవులు, శేషగిరి, యం. సూర్యకుమారి, పరాంకుశం కృష్ణవేణి, డి.వి.యస్. రామాచార్యులు, గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్, కేయస్వీ ప్రసాద్, పల్లపోలు నాగమనోహర లోహియా, జంధ్యాల కామేశ్వరి, తెలుగు పండితులు భాస్కర్, సీహెచ్ లక్ష్మణ్ మహేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.



ఎర్రన్న సాహిత్యపరిషత్ ఆధ్వర్యంలో ఎర్రన్నకు ఘన నివాళులు

ఎర్రన్న రచనలు సజీవం

తెలుగు సాహిత్య చరిత్రలో ప్రముఖ కవులు నన్నయ, ఎర్రన, తిక్కన త్రిమూర్తులు వంటి వారని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు అన్నారు. ఎర్రన సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ కవితా దినోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ప్రాంగణంలో ఎర్రన విగ్రహానికి జలాభిషేకం నిర్వహించి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఎర్రన అక్షర రమ్యత, ప్రసన్న కథాకథన శైలి, తిక్కన నాటకీయ శైలిని అనుసంధానం చేస్తూ ఎర్రన్న సాగించిన సూక్తి తెలుగు సాహిత్యానికి కీర్తి తీసుకువచ్చిందని ముఖ్య అతిథిగా పాల్గొన్న పొన్నూరు శ్రీనివాసులు అన్నారు. ఎర్రన్న సాహిత్య పరిషత్ అధ్యక్షుడు, మైనంపాటి సాయికుమార్ మాట్లాడుతూ ఎర్రన్న మన ప్రకాశం జిల్లా గుడ్లూరు ప్రాంతం కావటం జిల్లా వాసులు చేసుకున్న అదృష్టమన్నారు. ఆయన రచించిన హరివంశం, నృసింహ పురాణం, రామాయణం, మహాభారతంలోని అరణ్య శేష పర్వం తెలుగు వారికి అంతర్జాతీయ ఖ్యాతి ని తీసుకువచ్చాయన్నారు. ముస్లిం రచయితల సంఘం అధ్యక్షుడు షేక్ మహబూబ్ జాన్ మాట్లాడుతూ 14వ శతాబ్దపు కవి రచనలు 21వ శతాబ్దంలో కూడా సజీవంగా ఉన్నాయంటే రచయిత సామర్థ్యం, తెలుగు భాష వైభవం వ్యక్తం అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ అభ్యుదయ కవి ఎజ్రా శాస్త్రి, ప్రముఖ సాహితీ విమర్శకులు ఓరుగంటి ప్రసాద్, ప్రముఖ జ్యోతిష్య విద్వాన్ చివుకుల ప్రసాద్, శ్రీవారి సేవకులు పొత్తూరి బదరి పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



నీలాయపాలెం పంచాయతీని సందర్శించిన ఎంపీడీఓ

చినగంజాం: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఎంపీడీఓ యాబి వరప్రసాదరావు గురువారం మండలంలోని పలు గ్రామాలను సందర్శించారు. పరిశీలనలో బాగంగా మండలంలోని నీలాయపాలెం, బుచ్చిగుంట, రామచంద్రనగర్, కొత్తపాలెం, పల్లెపాలెం గ్రామాలను సందర్శించి పరిశీలించారు. పబ్లిక్ ప్రదేశాలలో, ముఖ్యకూడళ్లలో పార్టీ జెండాలను, ఫ్లెక్సీలను తొలగించాల్సిందిగా ఆయా పంచాయతీల కార్యదర్శులను ఆయన ఆదేశించారు. ఎన్నికల నిబంధలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన అధికారులను హెచ్చరించారు.

దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాలు

కారంచేడు: 6వ సంవత్సరం నుంచి 18వ సంవత్సరం వరకు వయస్సు ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అవసరమైన ఉచిత సహాయ ఉపకరణాల కోసం ఈనెల 27వ తేదీన పర్చూరు సహిత విద్యావనరుల కేంద్రంలో వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లులు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వినికిడి లోపం, దృష్టిలోపం, మానసిక వైకల్యం (బుద్ధి మాంద్యత), శారీరక వైకల్యం, ఆటిజం వంటి ప్రత్యేక అవసరా కలిగిన బాల,బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు, వీల్ చైర్స్, రోలెటర్స్, బ్రెయిలీ కిట్, టీఎల్ఎం కిట్లు వంటి కిట్లు అందజేస్తారన్నారు. సదరం క్యాంపునకు హాజరయ్యే వారు ఆధార్‌కార్డు జిరాక్స్, రేషన్‌కార్డు జిరాక్స్, కుల ధ్రువీకరణ పత్రం, రెండు ఫోటోలు, ఐడీ కార్డులను వెంట తీసుకురావాలన్నారు. మరింత సమాచారం అవసరమైన వారు వసంతబాబు (9100996453), బీ విజయకుమార్ (9100996460) నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ

చినగంజాం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో చినగంజాం జాతీయ రహదారిపై పలు వాహనాలను గురువారం పోలీసులు ఆపి తనిఖీ చేశారు. స్థానిక టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు పలు వాహనాలను తనిఖీ చేసి పంపించారు. ఎస్ఐ ఎం శ్రీనివాసరావు చెక్ పోస్టును పరిశీలించి చిన్న వాహనాలు, కార్లు, భారీ వాహనాలను తనిఖీ చేసి పంపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యాన ఆరోగ్య శిక్షణ



ధ్యాన శిక్షణ కార్యక్రమంలో మహిళలు, పురుషులు

ఒంగోలు మెట్రో: ప్రకాశం జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ టాబ్లెట్స్ రీసెర్చ్ ఫౌండేషన్ అధ్వరంలో ఒంగోలు సుజాత నగర్ ఐదో లైన్లో పిరమిడ్ మాస్టర్స్ చంద్రావతి, రాఘవరావు నిర్వహణలో మార్చి 10 ఆదివారం నుంచి పదకొండు రోజులు నిరంతరాయంగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా చివర రోజు గురువారం ధ్యాన ఆరోగ్య శిక్షణ కార్యక్రమంలో నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటలకు పిరమిడ్ ధ్యానం అవగాహన కార్యక్రమంలో ధ్యానం ఆరోగ్యం మీద చంద్రమతి రాఘవరావు మాట్లాడుతూ శ్వాస మీద, ధ్యానం మీద ప్రతి మనిషి నియంత్రణ కలిగి ఉండాలని అప్పుడే స్త్రీ, పురుషులు వారి జీవితాల్లో కలిగే మానసిక ఒత్తిడిని జయించి సంపూర్ణ ఆరోగ్య ఆరోగ్యవంతులు అవుతారని ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సుజాతా నగర్ మహిళలు పురుషులు సామూహికంగా పాల్గొన్నారు.

మార్టూరులో కేంద్ర సైనిక బలగాల కవాతు

మార్టూరు: దేశవ్యాప్తంగా ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన నేపథ్యంలో మండల కేంద్రం మార్టూరు, నాగరాజు పల్లి గ్రామాలలో గురువారం సాయంత్రం కేంద్ర బలగాల బృందం కవాతు నిర్వహించారు. స్థానిక జాతీయ రహదారిపై, నాగరాజుపల్లి గ్రామ వీధులలో ముందు జాగ్రత్త చర్యగా సైనిక బృందాలు పర్యటించాయి. కార్యక్రమాన్ని సీఐ ఎస్వీ రాజశేఖర్రెడ్డి, ఏఎస్ఐలు మహబూబ్ బాషా, సైదాలు పర్యవేక్షించారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి..

బల్లికురవ: భారత ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని ఎంపీడీవో హనుమారెడ్డి అన్నారు. వీఆర్‌వోలు, సచివాయ డిజిటల్ వేల్ఫేర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, మహిళా సంరక్షణా కార్యదర్శి గ్రామాల్లోని బ్యానర్లు, కరపత్రాల తొలగింపుతో పాటు ప్రారంభోత్సవ శిలఫలకాలకు స్టిక్కర్లు అంటించాలన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని ఎంపీడీవో వివరించారు.

వైభవంగా కోదండ రాముడి ఆలయ పునఃప్రతిష్ట

జే.పంగులూరు: మండల పరిధిలోని జాగర్లమూడివారిపాలెంలో ఈనెల 26 నుంచి మూడు రోజులపాటు కోదండ రాముని ఆలయ పునఃప్రతిష్ట మహోత్సవం జరగనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ ఆలయ నిర్మాణం సుమారు 18 వ శతాబ్దంలో రామాలయం నిర్మించారని, 170 ఏళ్ల నుంచి శ్రీరామనవమి పండుగను గ్రామస్తులు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1973లో ఆలయం మరమ్మతులు చేసినట్లు తెలిపారు. ఈ మధ్య కాలంలో ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఆలయ కమిటీ పెద్దలు ఆలయాన్ని తొలగించి, మరో ఆలయం నూతనంగా పునఃప్రారంభించారు. రూ. 2.50 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఈనెల 26తో మొదలై 28 న విగ్రహప్రతిష్టతో ముగుస్తుందని తెలిపారు.


ఎమ్మెల్యేను కలిసిన జాగృతి రెడ్డి సంక్షేమ సంఘం



ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిని కలిసిన రెడ్డి సంక్షేమ సంఘీయులు

చీరాల: చీరాల నియోజకవర్గ జాగృతి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధులు గురువారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థికరణం వెంకటేష్, ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. చీరాల నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి తమ వంతు సహాయాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు అక్కల పోలిరెడ్డి, ఉపాధ్యక్షులు రొండా భరత్‌రెడ్డి, దోకి బ్రహ్మానందరెడ్డి, సెక్రటరీ అప్పల శ్రీనివాసరెడ్డి, జాయింట్ సెక్రటరీ పాకనాటి సుధాకరరెడ్డి, వాలి ఆదినారాయణరెడ్డి, ఆట్ల చంద్రశేఖరరెడ్డి, ట్రెజరర్ కంచె సాంబిరెడ్డి, సలహాదారులు పిన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, అక్కల నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, జనార్దన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రామకృష్ణారెడ్డి, పల్లెర్ల వెంకటేశ్వరరెడ్డి, డి.వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.


ఓటు హక్కుపై కవితాగానం



కార్యక్రమంలో సత్కారం అందుకున్న కవులతో నిర్వాహకులు

ఒంగోలు టౌన్: 'ఓటు ఒక హక్కు మాత్రమే కాదు.. సామాన్యుడికి రాజ్యాంగం ఇచ్చిన ఆయుధం.. హామీ ఇచ్చి నెరవేర్చని నాయకులకు బుద్ధి చెప్పు.. ఇచ్చిన మాట జవదాటని నేతకు హారతి పట్టు'... అంటూ పలువురు కవులు చేసిన కవితా గానం ఆలోచన రేకెత్తించింది. ప్రేక్షకులను అలరించింది. నగరంలోని సమగ్ర శిక్ష అభియాన్ సమావేశ మందిరంలో గురువారం ప్రపంచ కవితా దినోత్సవం నిర్వహించారు. జిల్లా స్వీప్ విభాగం అధికారి వీఎస్ జ్యోతి, మండల విద్యాధికారి టి.కిశోర్‌బాబు ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యంలో ఎన్నికల గొప్పదనం, ఓటు ప్రాధాన్యత గురించి నిర్వహించిన కవితా గోష్ఠిలో పలువురు కవులు వారి కవితలను చదివి వినిపించారు. ప్రముఖ కవులు జాలాది మోహన్, ఎజ్రా శాస్త్రి, దర్శాసి చిరంజీవి, మొగిలి దేవప్రసాద్, రామకోటేశ్వరరావును సత్కరించారు.

వెంకటేశ్వరస్వామివారి శాంతి కల్యాణం



వెంకటేశ్వరస్వామి



స్వర్ణలో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

స్వర్ణ (కారంచేడు): మండలంలోని స్వర్ణ గ్రామంలో కొలువైన వెంకటేశ్వరస్వామివారి దేవాలయ 48వ వార్షికోత్సవాలను గత రెండు రోజుల నుంచి ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏవీఎస్ బ్రదర్స్ ఆధ్వర్యంలోని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి స్వామి వారి శాంతి కల్యాణంతో పాటు, ముత్తైదువులతో కుంకుమ పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సత్యన్నారాయణస్వామివారి వ్రతములను కూడా కన్నుల పండువగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.